క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సీఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల వయసు నిండిన వారు విద్యార్హత లేకపోయినా టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెండేళ్ల ఇంటర్‌ను ఒకే సంవత్సరం పరీక్షలు పూర్తి చేయవచ్చని తెలిపారు. డ్రాపౌట్లకు ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించి చేర్పించాలన్నారు. వివరాలకు 9502527708 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు రెవెన్యూ పరిధిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ మోహనప్రియ తహసీల్దార్ భార్గవికి విన్నవించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్ భార్గవిని కలిసి శాలువలతో సన్మానించి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎండీపుత్తూరు, ఎస్సీ, బీసీ కాలనీల శ్మశానాలకు హద్దులు, రోడ్ల ఏర్పాటు, ఎస్సీలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్, సర్పంచ్‌కు హామీ ఇచ్చారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మిద్దెల హరి తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న చాముండేశ్వరి ఆలయంలో సోమవారం భక్తుల కు అన్నదానం చేశారు. చాముండేశ్వరి అమ్మవారికి సోమవారం శ్రావణపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ మిద్దెల హరి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చల్లా జయరామయ్య, పులిరాధయ్య, నాగయ్య, చెన్నయ్య, జగదీష్, పాల్గొన్నారు. కాగా మిద్దెల హరి తనవంతు సాయంగా అన్నదానానికి రూ.5 వేలు విరాళం ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

తిరుపతి తుడా: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అందరూ దృష్టి సారించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించగా 42 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 మంది సమస్యలపై వినతులు అందజేశారని తెలిపారు. ప్రధానంగా శెట్టిపల్లిలో రోడ్లు మరమ్మతులు, పారిశుద్ధ్య, నగరంలో పలుచోట్ల రోడ్ల పక్కన ఉన్న చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని కోరారు. అలాగే గృహ నిర్మాణ సమస్యలు, భూగర్భ డ్రైనేజీ సమస్యలు, గొల్లవానిగుంటలో సర్వే పనులు చేయించాలని ప్రజలు కోరారని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, సెక్రటరీ రాధిక, కేఎల్ వర్మ, డీసీపీ శ్రీనివాస రెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్‌ఓలు సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల సర్వే పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవనోపాధుల సర్వేను కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. సోమవారం నగరంలోని దాసరిమఠంలో చేపట్టిన సర్వేను పరిశీలించి మెప్మా అధికారుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘంలో ఉన్న ప్రతి మహిళ కుటుంబ వివరాలను నమోదు చేయాలన్నారు. వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని జీవనోపాధి కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ఈ సర్వే ఉద్దేశమని తెలిపారు. అంతకుముందు రామాపురం సమీపంలోని బయోమైనింగ్ ప్లాంట్‌ను పరిశీలించారు. బైరాగిపట్టెడలో జరుగుతున్న డ్రింకింగ్ వాటర్‌ఫ్రమ్ ట్యాప్ సర్వేను రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అమెనిటీ, అడ్మిన్ సెక్రటరీలు కలసి ఈ సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు.



కనులపండువగా ఊంజల్‌సేవ

ముక్కంటీశ్వరాలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ కనులపండువలా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజలసేవ మండపానికి వేంచేపు చేశారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ ఊంజల్‌సేవ నిర్వహించారు. వెన్నెల కాంతులో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. - శ్రీకాళహస్తి



నిందితులను కఠినంగా శిక్షించాలి

పిచ్చాటూరు మండలంలోని స్థానిక జేబీఆర్ పాఠశాల చైర్మన్ జేబీఆర్ మునిరత్నం ఆధ్వర్యంలో కోల్‌కత్తా వైద్యవిద్యార్థిని అత్యాచారాన్ని నిరసిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం కొవ్వొత్తులు చేత పట్టి, నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దారుణ హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలంటే సత్వరం కేసు విచారణ పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.అనంతరం పిచ్చాటూరు అంబేద్కర్ విగ్రహం నుంచి బజారువీధి మీదుగా ఎస్‌బీఐ బ్యాంకు వరకు సేవ్ డాక్టర్స్, సేవ్ ప్రొఫెషనల్స్, సేవ్ డెమోక్రసీ అంటూ ర్యాలీ చేశారు. - నాగలాపురం

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

ఏర్పేడు: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. పంచాయతీల్లో వందశాతం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పంచాయతీ రాజ్ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా ఊడ్చేస్తాయ్!

పంట సాగు చేయడమంటే పుడమి పుత్రులకు పెద్ద పరీక్షే. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన చేతికి వచ్చే వరకు భరోసా లేదు. అడవి పందుల బెడద తీవ్రమైంది. విత్తు సాయి మొదలుకొని, దిగుబడి వచ్చే వరకు పలు దశల్లో నష్టం చేకూరుస్తున్నాయి. సజ్జ పంటను ధ్వంసం చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటను కాపాడుకోవడానికి కర్షకుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

- వామ్మో అడవి పందులు
- హడలెత్తుతున్న కర్షకులు
- పంటలు ధ్వంసం
- నష్టపోతున్న పుడమిపుత్రులు



పందులు నాశనం చేసిన సజ్జ

సత్యవేడు: మండలంలో సజ్జ పంట సాగు చేస్తున్న రైతులను అడవి పందులు హడలెత్తిస్తున్నాయి. మండలంలో కాదిరివేడు, బాలకృష్ణాపురం, కన్నావరం, జడేరి, అల్లపుగుంట, పీవీ పురంలో 400 ఎకరాలకు పైగా రైతులు సజ్జ పంట సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట రైతుల చేతికందే సమయంలో ఏదో ఒక దశలో ఇబ్బందులు తప్పడం లేదు. రేయింబవళ్లు పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి వస్తోంది. ఒకసారి వర్షాభావంతో పంట నష్టపోతే, మరోసారి ప్రకృతి విపత్తులతో తీవ్రంగా నష్టపోతున్నారు. నష్ట పరిహారాలు గతంలో దక్కేవి. కానీ ఈ ఏడాది పంటలపై అడవి పందుల బెడద తీవ్రమైంది. రైతులు సాగు చేసిన సజ్జ పంటను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోనే ఇవి ఎక్కువగా ఉన్నాయి. పగలంతా అటవీప్రాంతాల్లో ముళ్లపొదలు మాటున ఉంటున్నాయి. రాత్రి వేళ పంటలపై దాడి చేస్తూ ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు చేలల్లో గుడిసెలు వేసుకుని రేయింబవళ్లు కాపలా ఉండాల్సి వస్తోంది. గత వారం కాదిరివేడు, బాలకృష్ణాపురంలో పంటలను ధ్వంసం చేయడంతో అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పందులు గుంపులు గుంపులుగా వస్తుండడంతో కాపలా ఉన్న వారు ప్రాణ భయంతో పరుగులు తీస్తున్నారు.

విత్తు పడినప్పటి నుంచి ముప్పే

భూమిలో రైతులు విత్తనాలు వేసినప్పటి నుంచే అడవి పందులతో పంటలకు ముప్పు తప్పడం లేదు. అప్పులు చేసి పంట సాగు చేస్తే చేతికొచ్చే దిగుబడులను పందులు తినేస్తున్నాయి. సజ్జ చేలు పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి.

నష్ట పరిహారం చెల్లించాలి



రాత్రి వేళలో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంటలు నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. కొన్ని ప్రాంతాల్లో పందుల దెబ్బకు భయపడి రైతులు పొలాలు సాగు చేయకుండా వదిలేస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి, పంటలు దెబ్బతిన్న వారికి వెంటనే పరిహారం అందించాలి.

- ఈ పెరుమాళ్ కాదిరివేడు, సత్యవేడు మండలం

పంట దిగుబడి తగ్గుతుంది



నేను రెండు ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశాను. పంట సాగుకు సుమారు రూ. 30 వేలు ఖర్చు అయింది. పంట బాగానే పండింది. ఎకరాకు 20 బస్తాలు దిగుబడి వస్తుందనుకున్నాను. పంట పందులు ధ్వంసం చేయడంతో 10 బస్తాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి కూడా రాదనే భయం వేస్తుంది.

-జగన్నాథం, కాదిరివేడు, సత్యవేడు మండలం

విజ్ఞానంతోనే విజయం సాధ్యం

ఏర్పేడు: విజ్ఞానంతోనే విజయం సాధ్యమని తిరుపతి సెట్విన్ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్ఎస్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెట్విన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానమే విద్యార్థులకు శక్తివంతమైన ఆయుధమన్నారు. అబ్దుల్ కలాం, సునీతా విలియమ్స్, కల్పనా చావ్లాలాంటి వ్యక్తులు విజ్ఞానంతో ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక వికాసంలో ప్రతి విద్యార్థి శ్రద్ధ చూపాలన్నారు. గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతి కోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ, సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, అధ్యాపకులు శ్రీమన్నారాయణ, ఉమ, రామాంజులు, వెంకటసురేష్, రాఘవ రెడ్డి, శంకరప్ప, సువర్ణ, అమరేశ్వర్‌రెడ్డి, రాధ, నారాయణబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్ఎస్ రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న రాజేష్

- అధికార పక్షం నుంచి ఇబ్బందులు ఎదురైతే చెప్పండి
- పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సత్యవేడు సమన్వయకర్త రాజేష్

నారాయణవనం: ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు అన్ని విధాలా పార్టీ అండగా నిలిచి కాపాడుకుంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఈ ఎన్నికల్లో రుజువైందన్నారు. ఒకరు గెలిస్తే, మరొకరు ఓడిపోవడం వాస్తవమైనప్పటికీ నారాయణవనం మండలంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు జగనన్నపై నమ్మకంతో ఎన్నికల్లో గట్టిగా పనిచేశారని, ఆ కారణంగానే కేవలం 50 ఓట్ల మెజార్టీని మాత్రమే కోల్పోయామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటేసిన ప్రతి ఓటరుకు రుణపడి ఉన్నామని, వారి కోసం సమిష్టిగా కలిసి పనిచేద్దామని రాజేష్ పిలుపునిచ్చారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించి, నూతనోత్తేజం నింపడానికి కృషి చేస్తానని అన్నారు. మరో 20 నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో మరోసారి పార్టీ మద్దతుదారుల గెలుపునకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత విభేదాలను పక్కనపెట్టి ప్రజల కోసం పని చేయాలి కానీ కక్ష సాధింపు చర్యలు ఉండకూడదని తెలిపారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాయని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను తొలగిస్తూ పేదలపై కక్ష కట్టినట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. పార్టీ యువ నాయకుడు కిరణ్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు, పార్టీ మద్దతుదారులకు, సామాన్యులకు ఇబ్బందులు ఎదురైతే న్యాయపరమైన సహాయానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలను ఎవరికైనా దూరమైతే, నాయపోరాటానికి తాము పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీరేంద్ర వర్మ, భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదొరై, కిరణ్, పళణి రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు సాయిరవి, రాజారెడ్డి, తుంబూరు నాగూరు, సుబ్రమణ్యం రెడ్డి, గుణశేఖర్, తిరువట్యం నాగూరు, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, శంకరయ్య, వైస్ సర్పంచ్ మురళి, నాయకులు గురుస్వామి, దొరైరాజ్, సుబ్రమణ్యంయాదవ్, పీజీ బాబు, మార్కండేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారులు



ఐఏఎస్ అధికారులకు జ్ఞాపిక ఇస్తున్న అధికారి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం సీఎం పర్సనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తునికి బ్రాస్‌లెట్ అప్పగింత



భక్తునికి బ్రాస్‌లెట్ అందజేస్తున్న ఆలయాధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుచ్చినాయుడుకండ్రిగ మండలం కారణిమిట్ట గ్రామానికి చెందిన మణికంటయ్య అనే భక్తుడు సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చాడు. ఆ సమయంలో తన చేతికున్న బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్నాడు. ఆలయ సిబ్బంది గుర్తించి, దాన్ని ఎస్‌పీఎఫ్ సిబ్బందికి అందజేయగా వారు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తునికి తెలిపారు. మణికంఠయ్య వచ్చి సరైన ఆధారాలు తెలపడంతో అతనికి అప్పగించారు. దీంతో ఆయన ఆలయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు కృష్ణారెడ్డి, నాగభూషణం యాదవ్, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయులకు గాయాలు



ఆనందయ్య



మునిరత్నమ్మ

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న ఆటో ఎదురుగా స్కూటర్‌పై వెళుతున్న భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆనందయ్య, మునిరత్నమ్మ దంపతులు పుత్తూరులో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు స్కూటర్‌పై ఆనందయ్య, మునిరత్నమ్మ బయలుదేరారు. సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో విద్యార్థులు గుంపుగా రోడ్డు దాటుతుండగా వీరిని తప్పించేందుకు ఆనందయ్య ప్రయత్నించాడు. అదే సమయంలో పుత్తూరు వైపుగా వెళ్తున్న ఆటో అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనందయ్య, మునిరత్నమ్మ కింద పడిపోవడంతో తల, చేతులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎంఈఓ ప్రభాకర్‌రాజు, ఉపాధ్యాయ సంఘాలు గాయపడిన ఆనందయ్య, మునిరత్నమ్మను పరామర్శించారు. కళాశాల వేళల్లో ఆటోవాలాలు, విద్యార్థులు మోటార్ సైకిళ్లపై రోడ్డు నిబంధనలను పాటించకుండా అతివేగంగా వెళ్తుంటారు. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలు పాటించని వారిపై కళాశాల యాజమాన్యం, పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరు యువకులపై దాడి

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్‌లో ఇద్దరు యువకులపై దాడికి పాల్పడిన మరో యువకుడిపై కేసు నమోదైంది. ఏఎస్ఐ షణ్ముగం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్‌కు చెందిన బెల్లంకొండ శ్రీనివాసులు శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తాడు. అలాగే విష్ణు, పి.శ్రీను ఎలక్ట్రీషియన్లు. వీరు ముగ్గురు కలిసిమెలిసి ఉండేవారు. అయితే వీరి మధ్య ఇటీవల ఓ వివాదం తలెత్తింది. ఆదివారం రాత్రి మద్యం సేవించి పి.శ్రీను అనే యువకుడు బెల్లంకొండ శ్రీనివాసులు, విష్ణుపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీంతో బెల్లంకొండ శ్రీనివాసులుకు దవడ, కంటిరెప్పపై కత్తిపోట్లు పడి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే విష్ణుకు మోకాలు, చేతిపై కత్తిపోట్లు పడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన పి.శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షణ్ముగం తెలిపారు.

శ్మశానానికి దారి చూపాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామంలో శ్మశానానికి దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణం దారి చూపాలని మండలంలోని కొత్త పాళెం గ్రామస్తులు తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన వారు మాట్లాడుతూ శ్మశానం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో శవాన్ని తీసుకుపోవడానికి నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. శ్మశానం పంట పొలాల మధ్యలో ఉండడంతో శవాలను తీసుకెళ్లలేక పోతున్నామని తెలిపారు. అయితే గతంలో శ్మశానానికి దారి ఉండేదని, ఆ దారిని కొందరు ఆక్రమించుకోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా దారి చూపాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆక్రమణకు గురైన శ్మశానం రోడ్డును సర్వే చేసి, ఆక్రమణలను తొలగిస్తామని, దారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వెండి శఠారి వితరణ



వెండి శఠారిని అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో వేంచేసిన నమ్మాళ్వార్‌లకు తిరుపతికి చెందిన సతీష్, జయలక్ష్మి దంపతులు సుమారు రూ.90 వేలు విలువ చేసే వెండి శఠారిని విరాళంగా అందజేశారు. సోమవారం దాతలు శఠారిని టీటీడీ పెద్దజీయర్‌స్వామి సమక్షంలో అందించారు. అనంతరం అక్కడి నుంచి ప్రముఖ సంస్కృత పండితుడు, జాతీయ సంస్కృత వర్సిటీ సాహిత్య విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య చక్రవర్తి రంగనాథన్, సతీష్ నమ్మాళ్వార్ ఆలయ అర్చకులు భాష్యం వారికి శఠారిని నమ్మాళ్వార్ స్వామి వారి నిత్య కైంకర్యాలకు అందజేశారు.

ఘనంగా సిద్ధేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో సిద్ధేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో సిద్ధేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, పూలతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి



నారాయణవనంలో సామూహికంగా యజ్ఞోపవీతాలు ధరిస్తున్న గాండ్ల సంఘం సభ్యులు

నారాయణవనం: మండలంలోని ఆలయాలలో సోమవారం శ్రావణ పౌర్ణమి పూజలను నిర్వహించారు. పలువురు సామూహికంగా యజ్ఞోపవీతాలను మార్చుకుని, స్వీట్లను పంచారు. సొరకాయల స్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను అందుకున్నారు. ప్రతి గురువారం ఆలయంలో పేదలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దాతలచే ఏర్పాటు చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. అలాగే శింగిరికోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేకాన్ని, ధన్వంతరి, లక్ష్మీహోమాలను చేశారు. అనంతరం శ్రీదేవీ భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ ట్రస్టీ అన్నప్రసాదాలను అందజేశారు. ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్ మాట్లాడుతూ ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు మూడుపూటలా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమంలో పౌర్ణమి పూజలను నిర్వహించి, అన్నప్రసాదాలను వితరణ చేశారు. నారాయణవనం బస్టాండ్ సమీపంలోని రామాలయంలో వాణిజ్య గండ్ల సంఘం ఆధ్వర్యంలో పలువురు భక్తి శ్రద్ధలతో సామూహికంగా యజ్ఞోపవీతాలను ధరించారు.



అలంకరణలో సొరకాయలస్వామి

తూతూమంత్రంగా రోడ్డు మరమ్మతు పనులు



రోడ్డు కల్వర్టుకు ప్యాచ్ వేయని దృశ్యం



గాజులపెళ్లూరు గ్రామం వద్ద రోడ్డు పక్కను ఏర్పాడిన గుంతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ–సూళ్లూరుపేటతారురోడ్డుతో పాటు ఇరువైపులా గతంలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ఉన్న గుంతలకు గత నాలుగు రోజులుగా ఆర్అండ్‌బీ అధికారులు ప్యాచ్‌లు వేసి మరమ్మతులు చేయిస్తున్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ మాత్రం రోడ్డుపై ఉన్న అన్ని గుంతలకు ప్యాచ్‌లు వేయకుండా కొన్నిచోట్ల మాత్రమే వేసి, మరి కొన్నిచోట్ల వదిలేస్తుండడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై అన్ని గుంతలకు ప్యాచ్‌లు వేయాలని కోరుతున్నారు. అంతేగాకుండా రోడ్డుకు ఇరువైపులా గుంతలను పూడ్చడం లేదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.